ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

శనివారం, 4 మే 2024

5





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	46.7	27.1
భద్రాద్రి	46.0	27.0

కేఎంసీ 'హస్త'గతం



కాంగ్రెస్ గూటికి మేయర్ పునుకొల్లు నీరజ



మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మేయర్ నీరజ, మరో ఇద్దరు కార్పొరేటర్లు

- మరో ఇద్దరు కార్పొరేటర్లు కూడా...
- మంత్రి తుమ్మల సమక్షంలో చేరిక
- 10 నుంచి 31కి చేరిన కాంగ్రెస్ బలం
- 43 నుంచి 24కు పడిపోయిన బీఆర్ఎస్ బలం
- మిగిలిన వారు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు
- బీఆర్ఎస్ నేతలకు షాక్

ఖమ్మం, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)లో కాంగ్రెస్ బలం పెరుగుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు అసెంబ్లీ ఎన్నికల ముందు, తర్వాత చేరగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మరికొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్ బాట పడుతున్నారు. దీంతో బీఆర్ఎస్ కార్పొరేషన్‌లో బలహీనపడుతోంది. తాజాగా మేయర్ పునుకొల్లు నీరజతో పాటు 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపుడి రమాదేవి, 13వ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి నీరజలు తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ హస్తగతమైంది. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మేయర్‌ను మరో ఇద్దరు కార్పొరేటర్లను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన మేయర్ నీరజ మాట్లాడుతూ తాము మొదటినుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాయకత్వంలో పనిచేశామని, మంత్రి కృషితోనే ఖమ్మం జిల్లాతోపాటు ఖమ్మం నగరం ఎంతో అభివృద్ధి చెందిందని, గడిచిన మూడేళ్లుగా నిజాయితీగా పనిచేశామని రాబోయే కాలంలో కూడా అదే నిజాయితీతో పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మలతోపాటు నగర అధ్యక్షుడు జావీద్ పలువురు కాంగ్రెస్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇలా వుండగా, మరికొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లో చేరందుకు చర్చలు సాగిస్తున్నారు. త్వరలో మరికొందరు కాంగ్రెస్ బాట పట్టబోతున్నారు. 60 మంది ఉన్న ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ 43 స్థానాలను గెలవగా మిత్రపక్షం సీపీఐ రెండు గెలవడంతో 45మందితో బలం ఉండేది. కాంగ్రెస్ నుంచి 10 మంది కార్పొరేటర్లు (మిగతా 6వ పేజీలో)

గంటల వ్యవధిలోనే జంప్

బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు, నాయకులు ఎప్పుడు పార్టీ మారతారో తెలియని పరిస్థితి ఏర్పడింది. అందుకు తాజా ఉదాహరణ నగర మేయర్ పునుకొల్లు నీరజ. శుక్రవారం ఉదయం ఆమె బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బూత్‌లెవల్ కమిటీల సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి పాల్గొన్నారు. కానీ సాయంత్రం కల్లా ఆమె కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరం మోడల్‌గా నిలవాలి

- కాంగ్రెస్‌లో చేరిన వారు.. కలుపుకొని పోవాలి
- బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను ధీ కొట్టేందుకే చేరికలు: మంత్రి తుమ్మల

6



ఖమ్మంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న తుమ్మల, పక్కన పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి

కేంద్రంలోనూ ఇందిరమ్మ రాజ్యం

- కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దాం
- ఖమ్మం ఖ్యాతిని మరోసారి చాటాలి
- బీజేపీకి తొత్తు పార్టీగా మారిన బీఆర్ఎస్
- మంత్రులు తుమ్మల, పొంగులేటి
- ఖమ్మంలో జోరుగా సాగిన రోడ్‌షో

ఖమ్మం, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడించి రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకొని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామని, లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌ను గెలిపించుకొని రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకొని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసుకుందామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి ఖమ్మం కాంగ్రెస్ ఖ్యాతిని చాటాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి కేసీఆర్‌ను ఇంటికి పంపామని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి మోదీని ఇంటికి పంపిద్దామని, బీజేపీకి బీఆర్ఎస్ తొత్తుపార్టీగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం రాత్రి ఖమ్మంలోని జడ్పీ సెంటర్, ముస్తఫానగర్, శ్రీనివాసనగర్, త్రీటౌన్, గాంధీ చౌక్‌లలో మంత్రులు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల మంత్రులు ప్రసంగించారు. గాంధీ చౌక్ వద్ద రోడ్‌కార్నర్ సభలో మంత్రి తుమ్మల ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగసంస్థలు నెలకొల్పితే మోదీ ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారన్నారు. ప్రధాని మోదీ ఓటమి భయంతో అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజల మధ్యన విభజన చిచ్చు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు బీఆర్ఎస్, బీజేపీలు కుట్రలు పన్నుతున్నాయని తెలంగాణ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల అంతు చూస్తారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని టచ్‌చేస్తే మోదీకి గుణపాఠం తప్పదన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రభుత్వమని, కార్మికులు, వ్యాపారులు, రైతుల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఎత్తివేసిన తరువాత పేదలందరికీ రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు ఇచ్చి తీరుతామని, ఖమ్మం నియోజకవర్గంలో 6 వేల ఇళ్లస్థలాలు ఇస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేనని, రాష్ట్రంలో 17 స్థానాలు కాంగ్రెస్ గెలుస్తుందని, కేంద్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటుకు తెలంగాణ అండగా ఉంటుందన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించినట్లుగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓడించి, కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సభలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్, సీపీఎం నాయకుడు ఎర్రా శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకుడు బాలగంగాధర్ తిలక్ తదితరులు ప్రసంగించారు.

నేడు గూడేనికి సీఎం

- ప్రకాశం స్టేడియంలో ఎన్నికల ప్రచార బహిరంగ సభ
- హాజరుకానున్న పలువురు మంత్రులు, నేతలు
- పెద్ద ఎత్తున జనసమీకరణకు నేతల కసరత్తు

6



సిద్ధమైన సభావేదిక

సీఎంపై అక్రమ కేసులకు కుట్రలు

- ఎంపీ సీట్లు అధికంగా గెలుచుకుంటే సీఎంకు మరింత బలం
- కొత్తగూడెంలో నేటి బహిరంగసభకు భారీగా తరలిరావాలి: మంత్రి తుమ్మల
- కొత్తగూడెంలో ఏర్పాట్ల పరిశీలన

6



ఖమ్మంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న తాండ్ర వినోద్‌రావు

కాంగ్రెస్ గెలిస్తే త్రిపుల్ ఆర్ ట్యాక్స్

మోదీ నిధులతోనే ఖమ్మం అభివృద్ధి: బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

ఖమ్మం బైపాస్ రోడ్, మే 3: కాంగ్రెస్ గెలిస్తే త్రిపుల్ ఆర్ ట్యాక్స్ ఉంటుందని బీజేపీ గెలిస్తేనే ఖమ్మం సమగ్రాభివృద్ధి జరుగుతుందని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్యాలు, కోలాటాలతో బీజేపీ శ్రేణులు వినోద్‌రావుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాండ్ర మాట్లాడుతూ జిల్లా కేంద్రం ఖమ్మంలో మోదీ నిధులతోనే సెంట్రల్ లైటింగ్, పార్కులు, రోడ్ల అభివృద్ధి జరిగిందని, మళ్లీ అభివృద్ధి జరగాలంటే మోదీ ప్రభుత్వం కేంద్రంలో ఉంటేనే జరుగుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అబద్దాలు చెప్పి తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని, మంత్రి పొంగులేటి తమ్ముడు టికెట్ కోసం ప్రయత్నించి ఫలించక చివరికి వియ్యంకుడికి ఇప్పించుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి మహబూబాబాద్ జిల్లాకు చెందిన వారిని మన సమస్యలు ఆయనకెలా తెలుస్తాయని ప్రశ్నించారు. అదేవిధంగా గ తపదేళ్ల ఎంపీ పనితీరులో విద్యా, వైద్యం ఉపాధి లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో దేవకి వాసుదేవరావు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, భద్రం, సుధాకర్, ఎంఆర్‌పీఎస్ జాతీయ కార్యదర్శి మాచర్ల క్రాంతి పాల్గొన్నారు.

హోం ఓటింగ్ ప్రారంభం

- సరళిని పరిశీలించిన కలెక్టర్ గౌతమ్
- 8 వరకు సాగనున్న ప్రక్రియ

ఖమ్మం కలెక్టరేట్, మే 3: జిల్లాలో అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ శుక్రవారం నుంచి హోం ఓటింగ్ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ 8వ తేదీ వరకు కొనసాగనుంది. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ శుక్రవారం నగరంలో సహకారనగర్‌లో పర్యటించి, అక్కడ నిర్వహిస్తున్న హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం 85ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులు, ఎవరైతే ఓటుహక్కు వినియోగానికి పోలింగ్ కేంద్రానికి రాలేకపోతారో వారికి ఇంటి వద్దకే వచ్చి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. మొబైల్ పోలింగ్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన హోం ఓటింగ్ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 2504 ఓటర్ల నుంచి 12డి ద్వారా దరఖాస్తు స్వీకరించి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ చేపడుతున్నట్టు తెలిపారు. 49రూట్లు, 50 బృందాలను ఏర్పాటు చేసినట్లు, శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. హోం ఓటింగ్‌కు ముందస్తుగా షెడ్యూల్ రూపొందించి, దాని ప్రకారం సంబంధిత ఓటర్, పోటీచేసే అభ్యర్థులకు ముందస్తుగా సమాచారం అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఏ రోజుకారోజు పోలైన, పోల్ కానీ పోస్టల్ బ్యాలెట్లను సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారికి అందజేస్తారని, సహాయ రిటర్నింగ్ అధికారి పూర్తి భద్రతతో వాటిని భద్రపరుస్తారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి వెంట సహాయ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సిహెచ్.స్వామి తదితరులు వున్నారు.



హోం ఓటింగ్ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామా

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచుతాం...

- హామీలను అమలు చేయని కాంగ్రెస్‌ను నిలదీయాలి
- ఎంపీలు నామా, వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం కార్పొరేషన్, మే 3: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి, కేసీఆర్‌కు బాసటగా నిలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చిన హామీలను అమలు చేయిస్తామని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 1వ టౌన్, 3వ టౌన్ బూత్‌కమిటీల సమావేశంలో నామా, రాజ్యసభసభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా ప్రజల ఆశీర్వాదంతో, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల కృషితో చరిత్రాత్మక విజయం సాధించబోతున్నానన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన పథకాలు అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఓట్లు అడగటానికి వచ్చిన కాంగ్రెస్‌వారిని ప్రజలు నిలదీయాలన్నారు. మాజీమంత్రి పువ్వాడ అజయ్ మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా ప్రజలు చరిత్రను తిరిగిరాయాలన్నారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో నామాకు అత్యధిక మెజార్టీ రానున్నదని అన్ని సర్వేలు తేల్చి చెప్పాయన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ జిల్లా ప్రయోజనాల కోసం తనదైన శైలిలో పార్లమెంట్ వేదికగా నామా కృషి చేశారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం ఉందని, నామాదే విజయమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సీనియర్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, 1వ టౌన్, 3వటౌన్‌కు ప్రాంతాలకు చెందిన కార్పొరేటర్లు, నాయకులు గుండాల కృష్ణ, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాబోయ్ ఎండలు..

- ముదిగొండ మండలం పమ్మిలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత
- భద్రాచలంలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత
- పదేళ్ల గణంకాలు విడుదల చేసిన టీఎస్‌డీపీఎస్, డీఈఐఎస్
- రాష్ట్రంలోనే ముదిగొండలో అత్యధిక ఉష్ణోగ్రతలు
- 2015 మే 28న ముదిగొండలో 48.7 డిగ్రీల ఉష్ణోగ్రత
- గత పదేళ్లలో ఇదే అత్యధికం

7



ములకలపల్లి మండలంలో గాలి దుమారానికి చెట్టు విరిగి రోడ్డుపై పడిన దృశ్యం

గాలి దుమారం బీభత్సం

- పలుచోట్ల నేలకూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు ఇద్దరి మృతి
- రాలిన మామిడి కాయలు.. రైతులకు నష్టం
- చిరుజల్లులతో ఉపశమనం

భద్రాచలం/ములకలపల్లి/పెనుబల్లి, మే 3: ఒకవైపు భగభగ మండే ఎండలతో అల్లాడుతున్న వేళ.. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా సంభవించిన గాలిదుమారం పలు గ్రామాలను అతలాకుతలం చేసింది. కొన్ని చోట్ల చిరు జల్లులు కురువగా, రెండు గ్రామాల్లో పిడుగుపాటుతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. గత రెండు రోజులుగా ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు జల్లులతో కూడిన వర్షం ఉపశమనం కలిగించింది.

భద్రాచలంలో శుక్రవారం సాయంత్రం గాలిదుమారం రావడంతో పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. రంగనాయకులగుట్ట మీద మూడు, అశోకనగర్ కాలనీలోని సిద్ధార్థ స్కూలు దగ్గర మూడు, ఎఎస్ఆర్ కాలనీలో రెండు, భగవాన్‌దాస్ కాలనీలో నాలుగు విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పట్టణంలో రెండు గంటల పాటు విద్యుత్తు నిలిచింది. అనంతరం పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో మినహా అంతటా విద్యుత్తును పునరుద్ధరించారు. ఇదిలా ఉండగా ఎండ వేడిమితో సుభాష్‌నగర్ కాలనీలో చెట్టు కింద నిలిపి ఉంచిన కారుపై చెట్టు విరిగిపడింది. అలాగే పలు చోట్ల చెట్లు విరిగి రోడ్లపై విరిగిపడ్డాయి.

ములకలపల్లిలో రైతు మృతి



శివరాం మృతదేహం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని పూసుగూడెం పంచాయతీ ఒడ్డు రామవరంలో శుక్రవారం సాయంత్రం గాలిదుమారంతో పాటు మెరుపులు, ఉరుములతో వర్షం కురిసింది. దీంతో పిడుగుపాటుకు గురై బోడ శివరాం (40) మార్కెట్‌యార్డులో ధాన్యం కల్లం వద్ద అక్కడికక్కడే మృతి చెందాడు. మరో రైతు గుగులోత్ శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. మృతునికి భార్య అనిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అలాగే ఖమ్మంజిల్లా పెనుబల్లి మండలం కందిమళ్లవారిబంజర్ గ్రామంలో పశువులు ఇంటికి రాలేదని వెతికేందుకు ద్విచక్రవాహనంపై గ్రామసమీపంలోని పొలాల్లోకి వెళ్లిన అకినేపల్లి పూర్ణచంద్రరావు(32) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. కాగా, మండలంలోని సూరయ్యబంజర్, కోంద్రుపాడు, కేఎంబంజర్, మర్లకుంట గ్రామా ల్లో వడగండ్ల వాన పడింది. దీంతో ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది.



పూర్ణచంద్రరావు (ఫైల్)

నేడు కొత్తగూడేనికి సీఎం

- ప్రకాశం స్టేడియంలో ఎన్నికల ప్రచార బహిరంగ సభ
- హాజరుకానున్న పలువురు మంత్రులు, నేతలు

కొత్తగూడెం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం ఉదయం 11గంటలకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశంస్టేడియం గ్రౌండ్‌లో కాంగ్రెస్ ఎన్నికల బహిరంగసభ జరగనుంది. ఈ బహిరంగసభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్రమంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, జారె ఆదినారాయణ, మట్టా రాగమయితోపాటు సీపీఎం, కాంగ్రెస్, సీపీఐ పార్టీలకు చెందిన నాయకులు హాజరుకానున్నారు.

ఇప్పటికే బహిరంగసభ ఏర్పాట్లు సిద్ధం చేశారు. శుక్రవారం సాయంత్రం బహిరంగసభ వేదిక ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. సీఎం బహిరంగసభకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున జనసమీకరణను చేపడుతున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతోపాటుగా సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన వారిని తరలించేందుకు ఆయా నియోజకవర్గాలకు చెందిన బాధ్యులకు అప్పగించారు. ఇప్పటికే ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాల దుర్గా ప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య, కొత్తగూడెం నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త తుళ్లూరు బ్రహ్మయ్య తదితరులు జనసమీకరణలో తలమునకలై ఉన్నారు. ప్రకాశంస్టేడియం ప్రాంగణం వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ రోహిత్‌రాజు పరిశీలించారు. హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాలను ఎస్పీ సందర్శించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. పర్యవేక్షణకు జిల్లా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ సాయిమనోహర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంగ్‌సింగ్‌తోపాటు పలువురు సీఐలను బందోబస్తుకు ఏర్పాటు చేశారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

ట్రాఫిక్ డైవెర్షన్ ఇలా

సీఎం రాక సందర్భంగా కొత్తగూడెంలో ట్రాఫిక్ డైవర్షన్‌ను డీఎస్పీ రెహమాన్ వివరించారు. పాల్వంచ వైపు నుంచి కొత్తగూడెం మీదుగా విజయవాడ వైపుగా వెళ్లే వాహనాలు ఓల్డ్‌డిపో రోడ్డు నుంచి భజన మందిర్ రోడ్డు మీదుగా సింగరేణి హెడ్డాఫీస్ నుంచి రామవరం వైపుగా మళ్లించనున్నారు. భద్రాచలం, పాల్వంచ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి టేకులపల్లి, ఇల్లెందు మీదుగా ఖమ్మం వైపు వెళ్తాయన్నారు. ఖమ్మం నుంచి కొత్తగూడెం మీదుగా పాల్వంచ వైపు వెళ్లే వాహనాలు విద్యానగర్ బైపాస్ రోడ్డు నుంచి సింగరేణి హెడ్డాఫీస్, మెయిన్ హస్పటల్, భజనమందిర్ రోడ్డు, ఓల్డ్ డిపో రోడ్డు నుంచి మొర్రేడు వాగు బ్రిడ్జిమీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి పాల్వంచ వైపు వెళ్తాయన్నారు. విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు సింగరేణి హెడ్డాఫీస్, భజనమందిర్ రోడ్డు మీదుగా ఓల్డ్ డిపో రోడ్డు నుంచి మొర్రేడు వాగు బ్రిడ్జి మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డుకు మళ్లించామన్నారు.


బహిరంగసభ ఏర్పాట్లను పరిశీస్తున్న మంత్రి తుమ్మల

సీఎంపై కేసులు పెట్టేందుకు కుట్రలు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొత్తగూడెం, మే 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అక్రమంగా కేసులు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశం మైదానంలో శనివారం జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ లోపాయికారికంగా ఒప్పందం చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టాలనే ఆలోచనలో ఉన్నారని, వీరి కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు.జాతీయస్థాయిలో తెలంగాణ సమస్యలను, హక్కులను కాపాడుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసిన ఎంపీ అభ్యర్థులందరిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెల్చుకోవడం మూలంగా రాష్ట్ర ప్రభుత్వానికి, క్యాబినెట్‌కి, ముఖ్యమంత్రికి మరింత బలం చేకూరే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో మిగిలిపోయినటువంటి అంశాలన్నింటినీ కూడా అత్యధిక స్థానాలు గెలవడంతోనే సాధించుకొనేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో బయ్యారం ఉక్కుకర్మాగారాన్ని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీని, రాష్టానికి ఐఐటీని, ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను పరిష్కరించుకొనేందుకు కూడా పొందుపర్చామన్నారు. రాష్ట్రాభివృద్ధికి కూడా అత్యధికంగా నిధులు తెచ్చుకొనేందుకు ఎంపీలను గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీలను ప్రభుత్వం అమలుచేసిందన్నారు. మిగిలిన గ్యారెంటీ పథకమైన రైతు రుణమాఫీని కూడా ఆగస్టునెలలో తప్పనిసరిగా చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ వల్ల రైతుబంధు ఆగిపోయిందని ఎన్నికల అనంతరం రైతులకు రైతుబంధు డబ్బులు జమచేస్తామన్నారు. జూన్ నెలలో రైతుబీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులకు త్వరలో పంట నష్ట పరిహారం అందచేస్తామని, సాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. కొత్తగూడెంలో శనివారం జరుగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పనిచేయాలని, ఎండ వేడిమి అధికంగా ఉన్నందున పార్టీ శ్రేణులను బహిరంగ సభకు ఉదయం తొమ్మిదిగంటలకే తీసుకురావాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఇప్పటికే సీపీఐ, సీపీఎంతో పాటు తెలుగుదేశం అభిమానులు కూడా ఓట్లు వేసేందుకు ముందుకొస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఆరునెలల్లో పడిపోతుందంటూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అప్రజాస్వామికంగా మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు లోపాయికారి ఒప్పందంతో ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్నారని మంత్రి అన్నారు. మంత్రి తుమ్మల వెంట కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ఖమ్మం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త తుళ్లూరి బ్రహ్మయ్య ఉన్నారు.

బహిరంగసభను జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సీఎం రేవంత్ రెడ్డి శనివారం కొత్తగూడెంలో నిర్వహించే బహిరంగసభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. బహిరంగసభకు భారీ జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించే ఈ బహిరంగసభకు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డి

బీఆర్‌ఎస్ పాలనకు కాలం చెల్లింది

- ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి
- ఎమ్మెల్యే మట్టా రాగమయి

పెనుబల్లి, మే 3: బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, వారి పాలనకు, వారి మాటలకు కాలం చెల్లిందని నిత్యం సేవకుడైన ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డిని ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం వీఎంబంజర్ రింగ్‌సెంటర్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘురామిరెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మేపరిస్థితి లేదని, మాటలతో ఇంత కాలం మోసం చేశారని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసం పోటీచేసిన తనను ఇక్కడి ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకున్నారని అలాగే రఘురాం రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసే చర్యలు చేపట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలవుతుందని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం రూ.రెండులక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డి మాట్లాడుతూ తనను భారీ మెజార్టీతో గెలిపించాలని, ఎంపీగా ప్రజలతో ఉండి సేవ చేస్తానని, మతతత్వ పార్టీ బీజేపీని ప్రజలు మరిచారని, బీఆర్‌ఎస్‌ను నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మట్టా దయానంద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌కు కమ్మ మహాజన సంఘం మద్దతు

- సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 3: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి గెలుపునకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కమ్మ సామాజిక వర్గం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఖమ్మం జిల్లా కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు అన్నారు. శుక్రవారం నగరంలోని ఈఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కమ్మ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏర్పాటు చేసిందని, అందుకు ఖమ్మం మహాజన సంఘం ఖమ్మం జిల్లా తరుపున కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపామన్నారు. గత కొన్ని రోజులుగా ఖమ్మం పార్లమెంట్ సాధనంలో కమ్మ సామాజిక వర్గంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలు, అపోహలను కమ్మ సామాజిక వర్గ ప్రజలు నమ్మొద్దని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమ్మ మహాజన సంఘం కోశాధికారి నల్లమోతు రఘు, ఈసీ సభ్యులు బండా మాధవరావు, జిల్లాలోని వివిధ మండలాల సంఘం నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.


మాట్లాడుతున్న రామారావు

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

ముదిగొండ, మే 3: ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సంజయ్ జి.కోల్తే ఆదేశించారు. శుక్రవారం ముదిగొండ మండలంలోని న్యూలక్ష్మీపురం, కమలాపురం, బాణాపురం, వల్లభి, గంధసిరి, వల్లాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పోలింగ్‌రోజు షామియానాలు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. అలాగే వల్లభి గ్రామ సరిహద్దుల్లోని చెక్‌పోస్టును తనిఖీ చేసి ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను రిజిస్ట్రర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఎంపీవో సూర్యనారాయణ, ఆర్ఐ ఉషారాణి, ఏఎస్ఐ సాంబశివరావు పాల్గొన్నారు.


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న అధికారులు


మాట్లాడుతున్న తాండ్ర వినోద్ రావు

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం

- ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు

ఖమ్మం బైపాస్‌రోడ్, మే2: దేశాన్ని అభివృద్ధి చేయాలంటే మళ్లీ ప్రదాని మోదీ రావాలని అందుకు యువత ముందుండి పనిచేయాలని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని బీజేపీపార్లమెంట్ కార్యాలయంలో యువసమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో యువతే లీడర్లని, ఒక మోదీ, నడ్డా, నిర్మలాసీతారామన్ లాంటి స్థాయిలో మీరు కూడా ఎదగాలంటూ యువతకు సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నప్పటికి దానిని లెక్క చేయకండా యువత భారీగా ఈసమ్మేళనానికి హాజరుకావడం సంతోషకరమన్నారు. ప్రతి కార్యకర్త వంద మందితో సమానమని, యువత అంతా మోదీ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి తన గెలుపునకు సహకరించాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం మధిర నియోజకవర్గం బోనకల్ మండలంలోని లక్ష్మీపురానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బైన్ని నాగేశ్వరరావు, పులుసు రవి, తూటికుంట్ల గ్రామానికి చెందిన సీపీఎంసీనియర్ నాయకులు పాపినేని మోహన్‌రావు, గార్లపాడుకు చెందిన తాతా రామచంద్రరావుతో పాటు పలువురు నాయకులు బీజేపీలో చేరారు. ఈసదర్భంగా వారిని తాండ్ర పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ రామారావు, యువమోర్చ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, వీరభద్రం, శ్రీనివాస్ రవితేజ, సురేందర్‌రెడ్డి, పృథ్వీ, వినయ్, నాగాచారి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పోట్ల నివాసానికి వెళ్లిన రఘురాంరెడ్డి

ఖమ్మం కార్పొరేషన్, మే3: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ,మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు నివాసానికి కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎన్నికల ప్రచార సరళిపై చర్చించారు. రఘురాంరెడ్డి వెంట మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, కొప్పుల చంద్రశేఖరరావు తదితరులు ఉన్నారు.

ఆదరించండి. అభివృద్ధిచేసి చూపెడతా..

ఖమ్మం ప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనను ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని సీపీఎం,సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో జరిగిన వైశ్యుల ఆత్మీయసమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రచారం చేసి తనకు భారీమెజారిటీ అందించాలని కోరారు. అనంతరం వారితో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగరఅధ్యక్షుడ మహమ్మద్ జావేద్, నాయకులు చావా నారాయణరావుచ మద్దినేని బేబి స్వర్ణకుమారి, గుర్రం తిరుమలరావు తదితరులు ఉన్నారు.

బలరాంనాయక్‌ను గెలిపించాలి

- పినపాక ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, మే 3: లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. బూర్గంపాడు మండల పరిధిదిలోని సారపాకలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పాయం మాట్లాడారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దే అని అన్నారు.

సీతారాంనాయక్ విస్తృత ప్రచారం

మణుగూరుటౌన్/ దుమ్ముగూడెం, మే 3: మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారానాయక్ పట్టణంతో పాటు సబ్ డివిజన్, దుమ్ముగూడెంలోని గంతోలులో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై షాపులలో ప్రచారం నిర్వహించారు. దీంతోపాటు మొండికుంట, అశ్వాపురం, తోగ్గూడెంతో పలు ప్రాంతాల్లో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బీజేపీకు ఓట్లు వేయించాలని పిలపునిచ్చారు.

అదనపు ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

ఖమ్మం కలెక్టరేట్, మే 3: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కోసం అవసరమైన అదనపు ఈవీఎం మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఏఆర్వోలు, పోటీ అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల కమిషన్ 2,200 బ్యాలెట్ యూనిట్లను జిల్లాకు అదనంగా కేటాయించిందని, జిల్లాలో ఉన్న వైరా సెగ్మెంట్ బ్యాలెట్ యూనిట్లు, మిగులు బ్యాలెట్ యూనిట్లు కలిపి మొత్తం 3,941 బ్యాలెట్ యూనిట్ల మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి చేశామని తెలిపారు.

నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా చేపట్టాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ. గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో, ఎన్నికల పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఖమ్మం నగరం మోడల్‌గా నిలవాలి

- రాష్ట్రంలోనే అభివృద్ధిలో తనదైన ముద్రను చాటాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఖమ్మం నగరం మోడల్ నగరంగా నిలవాలంటే ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు సక్రమంగా జరగాలని, ప్రజల అవసరాలు తీరాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారులు వస్తున్నందున నగరానికి రింగ్‌రోడ్డు కూడా రాబోతుందన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ, 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపుడి రమాదేవి, 13వ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి నీరజలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడారు.

అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలు కబ్జాలు లేని ఖమ్మం, దౌర్జన్యాలు లేని ఖమ్మం, స్వచ్ఛమైన ఖమ్మం కావాలని కోరుకున్నారని, పోలీసుల ప్రమేయం లేకుండా పాలన సాగాలని ఆకాంక్షించారని నేడు అదేవిధంగా ఖమ్మంలో పాలన సాగుతుందన్నారు. గతంలోనే ఖమ్మానికి సుందరంగా తీర్చిదిద్దానని, ఖమ్మంలో డివైడర్లు, రోడ్లను చూసి రాష్ట్రంలో ఇతర జిల్లాలు కూడా అనుసరించాయని వివరించారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అన్ని అమల్లోకి వచ్చాయని, ఇప్పటికే ఐదుగ్యారంటీలు అమలు చేశామని రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ కూడా రెండు, మూడు నెలల్లో అమలు చేసి తీరుతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం ద్వారా రాష్ట్రానికి, జిల్లాకు పెద్ద ఎత్తున నిధులు వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కుట్రలు చేస్తున్నాయని పేర్కొన్నారు. అందుకే ఇతర పార్టీల నాయకులను, ప్రజాప్రతినిధులను చేర్చుకుని పార్టీని, ప్రభుత్వాన్ని బలోపేతం చేస్తున్నామని మంత్రి వివరించారు.

రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు అంతర్గతంగా పొత్తులు పెట్టుకున్నారని, కేసులు, జైళ్ల నుంచి తప్పించుకునేందుకు వాళ్ల అవసరాల కోసం పరోక్ష సహకారం బీజేపీకి బీఆర్‌ఎస్ అందిస్తున్నదని, లోక్‌సభ స్థానాల్లో మద్దతు ఇస్తున్నదని, అందుకే రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ఒక్కసీటు కూడా రావడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూడు, ఆరు నెలలకు కూలుతుందని ప్రచారం సాగిస్తున్నారని బీజేపీకి, బీఆర్‌ఎస్‌కు ఉన్న బలం ఎంతో ప్రజలకు తెలుసని, మహారాష్ట్రలోలాగా కలిసి కుట్ర పన్ని ప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు అస్థిరపరిచే ప్రయత్నం చేస్తుందన్నారు. వారి కుట్రలు నిర్వీర్యం చేసేందుకు పార్టీని, ప్రభుత్వాన్ని బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారంతా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మనోభావాలను అర్థం చేసుకుని కలుపుకొని ముందుకు పోవాలని, అభివృద్ధిలో వివక్ష ఉండకూడదని సూచించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్ తదితరులు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.


బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తనయులు పృథ్వీతేజ, భవ్యతేజ శుక్రవారం నగరంలోని 55వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుసుకున్నారు. నామా తనయుల వెంట నాయకులు సుధాకర్, మధు, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.
- ఖమ్మం కార్పొరేషన్


కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి రఘురామిరెడ్డిని గెలించాలని సినీ నటుడు వెంకటేష్ కుమార్తె ఆశ్రీత, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమార్తె స్వప్నిరెడ్డి, రఘురామిరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి ముదిగొండ మండలం కమలాపురం, బాణాపురంలో ప్రచారం నిర్వహించారు.
- ముదిగొండ

కేఎంసీ 'హస్త'గతం

(5వ పేజీ తరువాయి)

గెలిచారు. మిగిలిన వారిలో ఇద్దరు సీపీఎం, ఇద్దరు స్వతంత్రులు, బీజేపీనుంచి ఒకరు గెలిచారు. ఆ తర్వాత కొందరు కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌లో చేరారు. అయితే గత నవంబరులో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు ఖరారు కావడంతో కొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు తుమ్మలకు మద్దతు పలికి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార మరికొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. కార్పొరేషన్‌లో 60 మంది కార్పొరేటర్లకుగాను ప్రస్తుతం మేయర్‌తోపాటు మరో ఇద్దరు కార్పొరేటర్ల చేరికతో కాంగ్రెస్ బలం 31కు చేరింది. వామపక్షాలు కూడా కాంగ్రెస్‌తో మిత్రపక్షంగా ఉన్నందున 35కు బలం పెరిగింది. బీఆర్‌ఎస్ చేతిలో ఇంకా 24మంది కార్పొరేటర్లున్నారు. వీరిలో కూడా కొందరు కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు సాగిస్తున్నారు. కొన్నిచోట్ల బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల రాకను కాంగ్రెస్ కేడర్ వ్యతిరేకిస్తుండడంతో వారు చేరికల ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికలలోపే మరికొందరు కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.


పాల్వంచలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

బీఆర్‌ఎస్ హయాంలోనే వ్యవసాయానికి పెద్దపీట

- ఖమ్మం పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

పాల్వంచ/ చుంచుపల్లి/ అశ్వారావుపేట రూరల్/ దమ్మపేట, మే 3: రైతులకు రైతుబంధు, రైతుబీమా, గిట్టుబాటుధర, ఉచిత విద్యుత్ తదితర ఆదర్శవంతమైన పథకాలను అమలు చేసి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసింది కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఖమ్మం పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పాల్వంచ, చుంచుపల్లి, అశ్వారావుపేట, దమ్మపేటలో నిర్వహించిన బీఆర్‌ఎస్ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు, 420 మోసపూరిత హామీలతో అందరినీ మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందని, అందరినీ నిలువునా మోసం చేసిన కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని అన్నారు. తెలంగాణాను అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను కారుగుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నామా ఓటర్లను అభ్యర్థించారు. తులం బంగారం, పింఛన్ల పెంపు, రైతుబంధు, ఎక్కడా కనిపించటంలేదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే ఐదు నెలల్లోనే కాంగ్రెస్ అంధకారంలోకి తీసుకుపోయిందన్నారు. సాగుకు, తాగునీటికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు కలిసిపోయి పనిచేస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే సింగరేణి కార్మికుల అభివృద్ధి సాధించుకున్నామని అన్నారు. కొత్తగూడెం రైటర్ బస్తీలో ఉన్న సెంట్రల్ వర్క్ షాపులో సింగరేణి కార్మికులను కలిసి ఓటు వేయమని అభ్యర్థించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మున్సిపాల్ చైర్మన్ కాపు సీతామహాలక్ష్మితో కలిసి పర్యటించారు.

గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా
వీరభద్రరావు బాధ్యతల స్వీకరణ


వీరభద్రరావును అభినందిస్తున్న నలమల

తల్లాడ, మే 3: తల్లాడ మండలం గంగదేవిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా తూము వీరభద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గంగదేవిపాడు సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న రాయల వెంకటశేషగిరిరావు డీసీసీబీలో తీసుకున్న కారు రుణం సకాలంలో చెల్లించకపోవడంతో అప్పటి డీసీవో విజయకుమారి ఆయనపై అనర్హత వేటు వేశారు. సహకార చట్టం ప్రకారం సొసైటీ, డీసీఎంఎస్ చైర్మన్‌గా శేషగిరిరావు కొనసాగే అర్హత లేదని గత జనవరి 23న ఉత్తర్వులిచ్చారు. దీంతో సొసైటీ వైస్‌చైర్మన్‌గా ఉన్న తూము వీరభద్రరావును అధ్యక్షుడిగా నియమిస్తూ అప్పట్లో బాధ్యతలు అప్పగించారు. డీసీవో ఉత్తర్వులను సవాల్ చేస్తూ శేషగిరిరావు గత జనవరి 26న సహకార ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించిన దృష్ట్యా డీసీవో ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని ట్రిబ్యునల్ జనవరి 31న తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తూము వీరభద్రరావు, డీసీవో హైకోర్టులో ఫిబ్రవరి 24న పిటిషన్ దాఖలు చేయగా వరంగల్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని హైకోర్టు ఏప్రిల్ 19న తీర్పునిచ్చింది. ఈమేరకు ఈనెల ఒకటోతేదీన తిరిగి తూము వీరభద్రరావును సొసైటీ చైర్మన్‌గా నియమిస్తూ డీసీవో మురళీధర్‌రావు ఉత్తర్వులిచ్చారు. దీంతో తూము వీరభద్రరావు సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. తూము వీరభద్రరావును రైతుబంధు జిల్లా మాజీ కన్వీనర్ నలమల వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు తూము సురేష్, కాంగ్రెస్ నాయకులు గణేశుల రవి, పాతంగులపాటి లక్ష్మీనారాయణ, పోట్రు శ్రీను తదితరులు అభినందించారు.

నేటినుంచి వారం రోజులు గాంధీపురం రైల్వేగేటు మూసివేత

కారేపల్లి/కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్ మే 3: మండల పరిధిలోని గాంధీపురం రేల్వేస్టేషన్ లో శనివారంనుంచి 10వతేది వరకు వారం రోజులు పాటు మరమ్మతులు కారణంగా మూసివేస్తున్న ట్లు రేల్వే అధికారులు శుక్రవా రం ఓప్రకటనలో తెలిపారు. ఇల్లెందు-ఖమ్మం ప్రధా న రహదారిలోగల గాంధీపురం రేల్వే స్టేషన్‌ద్వార నిత్యం ప్రయాణించే వాహనదారులు వయా కారేపల్లి క్రాస్ రోడ్డు నుంచి కారేపల్లి పట్టణం ద్వార ప్రయాణాలు చేసుకో వాలని అధికారులు తెలిపారు. ప్రయాణికులు సహకరించా లని కోరారు.

యువతిని వేధించిన కేసులో 6నెలల జైలు

ఖమ్మం లీగల్, మే 3: కొణిజర్ల మండలం బోడియాతండాకు చెందిన గుగులోత్ భవన్‌కుమార్‌కు యువతిని వేధించిన కేసులో 6నెలలు జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మూడవ అదనపు ప్రథమశ్రేణికోర్టు న్యాయాధికారి వినుకొండ మాధవి శుక్రవారం తీర్పుచెప్పారు. కేసు వివరాలు కొణిజర్ల మండలం బోడియాతండాకు చెందిన యువతిని పెళ్లి చేసుకోమని వేధిస్తున్నాడని 2019న కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదుచేయగా నిందితుడిపై కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్టుచేసి కేసును విచారించి కోర్టులో చార్జీషీట్ దాఖలుచేశారు. ఆ కేసును విచారించిన న్యాయాధికారి నేరు రుజువు కావటంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. అదనపు ప్రాసిక్యూటర్ జి.రాహుల్ వాదించారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి


కొత్తగూడెం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సుజాతనగర్, మే 3: ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడికి పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. సుజాతనగర్ మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు సుమారు 30 మంది సమీప చిరునోముల కుంటలో మట్టి పని చేస్తున్నారు. కుంట కట్ట వెంట ఉన్న ముళ్ల పొదలను కూలీలు తొలగిస్తున్న క్రమంలో తేనెటీగలు ఒక్కసారిగా వారిపై దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు ఎనిమంది వాటి తాకిడికి గురికాగా సహచర కూలీలు వారిని స్థానిక కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో మక్బూల్, షైమున్నీసా, బీయమ్మ, మదీనా అను నలుగురిని తీవ్రంగా కుట్టిన నేపథ్యంలో వారిని 24 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు తోటి కూలీలు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పినపాక, మే 3: మండలంలోని దుగినేపల్లి గ్రామంలో 5 సంవత్సరాలుగా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి గురువారం రాత్రి గ్రామశివారులో చనిపోయి పడి వున్నాడు. గమనించిన స్థానికులు ఏడూళ్లబయ్యారం ఎస్ఐ వెంకటప్పయ్యకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, పంచనామా నిర్వహించారు. ప్రాథమిక విచారణ నిర్వహించిన పోలీసులు మృతుడి పేరు ఎర్రయ్య(45)గా గుర్తించారు. నలుపు రం గు కలిగి, ఎడమ చేతి ఉంగరపు వేలు కట్ అయి ఉందని ఆనవాళ్లు వెల్లడించారు. మృతదేహాన్ని మణుగూరులోని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుడికి సంబంధించిన వ్యక్తులు, బంధువులు ఏడూళ్లబయ్యారం పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ వెంకటప్పయ్య కోరారు.

రెండు ఆటోలు ఢీ: డ్రైవర్ దుర్మరణం

సత్తుపల్లిరూరల్, మే3: రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఒకరు మృతిచెందిన సంఘటన శుక్రవారం సత్తుపల్లి మండలం మేడిశెట్టివారిపాలెం అడ్డరోడ్డు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కలగరకు చెందిన ఆటో డ్రైవర్ కొవ్వూరి తిరుపతిరావు (35) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నుంచి స్వగ్రామం వెళ్తున్నాడు. అదే సమయంలో ఆంధ్రాలోని విజయవాడలోని కృష్ణలంకకు చెందిన ఆటోడ్రైవర్ అన్నపరెడ్డి ప్రసాద్ వస్తున్నాడు. వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తూ ఆటోను ఢీకొనడంతో తిరుపతిరావుకు తీవ్రగాయాలవ్వగా 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య


యశ్వంత్ (ఫైల్)

చంద్రుగొండ, మే 3: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫైయిల్ అయ్యాననే మనస్థాపంతో రాజబోయిన యశ్వంత్(17) విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం భద్రాద్రికొత్తగూడెం, చంద్రుగొండ మండలంలోని తిప్పనపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక స్టేషన్ హెడ్‌కానిస్టేబల్ ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం తిప్పనపల్లి చెందిన రాజబోయిన నాగేశ్వరావు పెద్ద కుమారుడు యశ్వంత్ కొత్తగూడెంలోని ఒక ప్రయివేటు కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటివల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో యశ్వంత్ ఫెయిల్ అయ్యాడు. అప్పటినుంచి యశ్వంత్ మనోవేదనతో ఉన్నాడు. ఈ క్రమంలో తండ్రితో కలిసి పొలంలోకి వెళ్లిన యశ్వంత్ తండ్రి ఎరువుల బస్తాలు తెచ్చేందుకు వెళ్లిన సమయంలో యశ్వంత్ చెట్టుకు ఉరేసుకొన్ని బలవన్మరణం పొందాడు. తండ్రి నాగేశ్వరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మద్యానికి బానిసై వ్యక్తి ..

బూర్గంపాడు, మే 3: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో శుక్రవారం చోటు చేసుకుంది. సారపాకకు చెందిన నాగమల్లీశ్వరికి తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి గ్రామానికి చెందిన అమరజీవి(32)తో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇరువురు సంతానం. వీరు ఐదేళ్లుగా సారపాకలో నివాసం ఉంటూ తాపిమేస్త్రిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అమరజీవి ఇటీవల మద్యానికి బానిసయ్యారు. గురువారం రాత్రి తాగిన మైకంలో ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. శుక్రవారం మృతుని భార్య ఫిర్యాదు మేరకు అదనపు ఎస్ఐ నాగబిక్షం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బాబోయ్ ఎండలు..

- ముదిగొండ మండలం పమ్మిలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత
- భద్రాచలంలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత

ఖమ్మం, మే 3 (ఆంధ్రజ్యోతి): 48.7 డిగ్రీలు.. ఇది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గడిచిన పదేళ్లలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత. గడిచిన కొన్నేళ్ల నుంచి వేసవికాలంలో ఎండలు మండిపోతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొన్నేళ్లుగా ప్రతీ నెలలోనూ 40డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక విభాగం (టీఎస్‌డీపీఎస్), డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ (డీఈఎస్) కలిసి రూపొందించి విడుదల చేసిన వాతావరణ గణాంకాలలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

పదేళ్లలో 48.7 డిగ్రీలే అత్యధికం

2013 నుంచి 2023వరకు రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఉష్ణోగ్రతల అంశాలపై టీఎస్‌డీపీఎస్, డీఈఎస్ విభాగాల వారు విడుదల చేసిన గణాంకాల్లో గడిచిన పదేళ్లలో ఖమ్మం జిల్లాలో 2015 మే 28న ముదిగొండలో 48.7డిగ్రీల ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదైనట్టు పేర్కొంది. అత్యల్పంగా తిరుమలాయపాలెం మండలంలో 2015 జనవరి 11న 7.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాద్రి జిల్లాలో 2015 మే 21న అత్యధికంగా టేకులపల్లిలో 48డిగ్రీలు నమోదు కాగా.. అత్యల్పంగా దమ్మపేటలో 2015 జనవరి 11న 7.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంతేకాదు నవంబరు నుంచి జనవరి వరకు మాత్రమే 39నుంచి 40 డిగ్రీల వరకు నమోదు కాగా, మిగిలిన నెలల్లో 40డిగ్రీలు దాటిపోయి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే ఉమ్మడి జిల్లాలో మాత్రం నగటు ఉష్ణోగ్రతలు 32నుంచి 40 డిగ్రీల వరకు నమోదైనట్టుగా పేర్కొన్నారు. ఇక అత్యల్పంగా జనవరిలో ఖమ్మం జిల్లాలో 7.6, భద్రాద్రి జిల్లాలో 7.4డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపింది.

కాగా, ఖమ్మం జిల్లాలో శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధికంగా ముదిగొండ మండలం పమ్మిలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంతంలో 46 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది.

పదేళ్లలో ఉభయ జిల్లాల్లో నమోదైన
అత్యధిక, అత్యల్ప, సగటు ఉష్ణోగ్రతలు

నెల	అత్యధికం	అత్యధిక సగటు	అత్యల్పం	అత్యల్పసగటు	వర్షపాతం(ఎంఎం)
జనవరి	41.7/37.6	32.3/32.1	7.6/7.4	17.8/16.9	7.7/8.6
ఫిబ్రవరి	43.5/40.9	34.8/34.9	11.5/9.2	18.3/17.9	5.9/6.4
మార్చి	44.9/45.9	37/37.2	14/11.6	22/22.2	9.5/13.8
ఏప్రిల్	48.3/46.8	39.7/39.6	18.4/18.2	24.9/25.2	14.7/23.9
మే	48.7/48	40.9/40.6	20.6/20.4	27/27.1	54.6/55.9
జూన్	46.6/46.5	37.1/36.5	16.5/21.4	26.6/26.7	124.5/164.4
జులై	43.1/44.6	33.8/33.1	21.7/13.7	25.4/25.5	249/302.5
ఆగస్టు	40.8/42.3	33.5/32.8	21.8/20.7	25.1/25.2	249/300.6
సెప్టెంబరు	40/39.8	34/33.6	21.1/20.6	24.9/24.9	183.7/198
అక్టోబరు	40/40	34.4/34	15.2/15.1	23.5/23.3	109.1/92.4
నవంబరు	39.1/39	33.2/32.9	11.7/11.8	20.5/20	27.9/27.1
డిసెంబరు	38.6/39.8	32.2/31.7	8.4/7.8	8/17.2	5.9/5.9

నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలి

- ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్
- వైరా డివిజన్ అధికారులతో సమీక్ష


నేర సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం క్రైం, మే 3: నేరాల నియంత్రణకు పోలీస్ పెట్రోలింగ్, నిఘా వ్యవస్థను మరింత పటిష్టపరచాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వైరా డివిజన్ పోలీసు అధికారులతో జరిగిన నేరసమీక్ష సమావేశంలో పోలీస్ స్టేషన్లవారిగా నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులలో చేసిన దర్యాప్తు, విచారణ స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై పోలీస్‌కమిషనర్ సమీక్ష జరిపారు. సీపీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరగాలంటే కేసుల దర్యాప్తులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, నేరం జరిగాక ఘటనాస్థల పరిశీలన సాక్ష్యాధారాల సేకరణ, కేసు నమోదు, నిందుతుల అరె స్టు, దర్యాప్తు, చార్జిషీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళి కాబద్ధంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. దొంగతనాల నియంత్రణ, చోరిసొత్తు రికవరీ, పాత నేరస్థుల కదలికలపై పోలీసు అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని అన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంచూస్తూ, రాత్రి గస్తీ పెంచాలన్నారు. అదేవిధంగా బస్టాండ్లలో, ప్రజలు రద్దీగాఉండే ప్రదేశాలలు విజుబుల్ పోలీసింగ్ అమలుచే యాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలమీదుగా వచ్చె గంజా యి, నగదు, మద్యం అక్రమ రవాణాను నియంత్రించాలన్నారు. చెక్‌పోస్టులను విధిగా తనిఖీచే యాలని, అదేవిధంగా గత ఎన్నికలలో జరిగిన నేరాలను సమీక్షించి ఆయా ప్రాంతాల్లో మరోసారి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైరా ఏసీపీ రహమాన్, సీసీఆర్బీ ఏసీపీ సాంబరాజు, సీఐలు సాగర్, మధు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలి మృతి

దమ్మపేట, మే 3: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. ఈఘటనకు సంబందించి దమ్మపేట పోలీసులు తెలిపినన వివరాల ప్రకారం చర్ల మండలం ఆర్ కొత్తగూడెం గ్రామానికి చెందిన పొడియం మహేష్ అనే వ్యక్తి మరో వ్యక్తితో కలిసి ద్విచక్రవానంపై దమ్మపేట వస్తున్న క్రమంలో దమ్మపేట మండలం ఆర్లపెంట గ్రామంలో అదే గ్రామానికి చెందిన ఊకే బుచ్చమ్మ (75) రోడ్డు దాటుతుండగా ఢీకొట్టాడు. ఈప్రమాదంలో బుచ్చమ్మకు తీవ్రగాయాలు కావటంతో ఆమెను సత్తుపల్లి తరిలించి ప్రథమచికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించి చికిత్స నిర్వహిస్తుండగా శుక్రవారం మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మిషన్ భగీరథ పైప్ లీకేజీతో ధ్వంసమైన ఇల్లు



ఇల్లెందుటౌన్, మే 3: మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకేజీ కారణంగా నాలుగు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇల్లెందు పట్టణంలోని 24వ వార్డు సీఎస్ఐ చర్చి సమీపంలో పాకాలరోడ్డుకు పక్కన ఉన్న మిషన్‌భగీరథ ప్రధానపైపులైన్ శుక్రవారం మధ్యాహ్నం లీకై పెద్దఎత్తున నీరు పైకి ఎగచిమ్మింది. నీరుపెద్ద ఎత్తున సమీప ప్రాంతాల ఇళ్లలోకి పెద్ద ప్రవాహంతో వెళ్లడంతో ఇళ్ల లోపలిభాగంలో ధ్వంసమయ్యాయి. ఫ్యాన్లు, ఫ్రిజులతోపాటు వరదనీటి ప్రవాహానికి రేకులషెడ్లు సైతం కూలిపోయాయి. ఈ సమయంలో ఇళ్లలో ఉన్న మహిళలు, పిల్లలు వరదనీటి ప్రవాహానికి భయాందోళనకు గురయ్యారు. మిషన్‌భగీరథ పైపులైన్ సమీప ప్రాంతాలకు చెందిన గుంటి ఆండాలమ్మ, భూక్యా బాలు, అజ్మీర కిషన్, దారావత్ మంగీలాల్, దారావత్ లచ్చిరాంలకు చెందిన ఇళ్లలోని గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. కాగా భగీరథ పైపులైన్ లీకేజీ సమాచారం అందుకున్న భగీరథ అధికారులు తక్షణమే నీటి సరఫరాను నిలిపివేశారు. మరమ్మతులను సైతం చేపట్టారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు


పోలీసులకు పట్టుబడిన హిడ్మా

పాల్వంచ, మే 3: బావను చంపి ఆత్మహత్యగా చిత్రీకరించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టుచేయగా మరొకరు పరారీలో ఉన్నారు. పాల్వంచ రూరల్ పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. అరెస్టు అయిన వారిలో ఒకరు మైనర్. పోలీసుల కథనం ప్రకారం బంజర గ్రామ పంచాయతీలోని చిరుతనపాడు గ్రామానికి చెందిన పద్దం ఉంగా (21) లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీలోని కొత్తూరుకు చెందిన ఉంగిని నెల రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ విషయంలో కుల పెద్దలు అతనికి రూ.1.5లక్షల జరిమానా విధించారు. అందులో రూ.120వేలు ఉంగా చెల్లించాడు. కానీ మిగిలిన సొమ్ము రూ.30వేలు చెల్లిస్తేనే తమ చెల్లిని కాపురానికి పంపిస్తామని ఉంగి సోదరులు అడమ, హిడ్మా, మరొక మైనర్ తేల్చి చెప్పారు. తరువాత ముగ్గురు ఉంగాతో కలసి మద్యం సేవించి ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. అనంతరం నిందితుల బావ ఉంగా వచ్చి బతిమిలాడినా వారు కనికరించలేదు. కానీ ఆ తరువాత ఉంగా మరలా వారిని బతిమిలాడుతుండటంతో తమ చెల్లిని చంద్రుగొండ మండలం మద్దుకూరుకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తారు. అందుకు ఉంగి సహకరించకపోవడం, ఆమె ఎవరికీ చెప్పకుండా పెద్దకలశలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. తమ చెల్లెలు కనిపించకుండా పోవడానికి కారణం బావ ఉంగా అని వారు అనుమానించారు. దీంతో ఉంగా కోసం కాపు కాచి అటవీ ప్రాంతంలో అతనిని పట్టుకుని గొంతు బిగించి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా చెట్టుకు ఉరి వేసి ఆత్మహత్య చేసుకున్నట్టుగా చిత్రీకరించారు. ఉంగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు రేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులకు అనుమానం వచ్చి ఉంగా బావమరుదుల ను విచారించగా మొత్తం విషయం బయట పడింది. నిందితులు హిడ్మా, మైనర్ పట్టుబడగా మరో నిందితుడు అడమ పరారీలో ఉన్నాడని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ తెలిపారు.

మొన్న అన్న.. నేడు తమ్ముడు

- వారం వ్యవధిలో జ్వరంతో అన్నదమ్ముల మృతి
- లక్ష్మీకాలనీలో అదుపులోకి రాని జ్వరాలు
- పట్టించుకోని అధికారులు


వారం వ్యవధిలో మృతిచెందిన అన్నదమ్ములు (ఫైల్)

చర్ల, మే 3: జ్వరంతో మొన్న అన్న చనిపోగా, ఐదు రోజుల వ్యవధిలో తమ్ముడు మృతి చెందిన ఘటన చర్ల మండలం లక్ష్మీకాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. వారం రోజుల వ్యవధిలో ఒకే ఇంట్లో ఇద్దరు యువకులు చనిపోవడంతో గ్రామంలో విశాద చాయలు అలుము కున్నాయి. చర్ల మండలం లక్ష్మీ కాలనీకి చెందిన గిరిజన యువకుడు వాసం విజయ్ (19) నాలుగు రోజుల క్రితం జ్వరం బారిన పడ్డాడు, ఇదే క్రమంలో చర్లలోని ఆర్ఎంపీ దగ్గర వైద్యం చేయించుకున్నాడు, తగ్గక పోవడంతో అక్కడి నుంచి చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఆవుపల్లి వెళ్ళి, మరో సారి వైద్యం చేయించుకున్నాడు, విజయ్ పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఇదే క్రమంలో శుక్రవారం వైద్యం పొందుతూ మృతి చెందాడు. కాగా జ్వరం బారిన పడ్డ ఐదు రోజుల్లో విజయ్ మృతి చెందాడని, భద్రాచలంలో వైద్య రక్త పరీక్షలు చేయగా డెంగ్యూ, టైఫాయిడ్ ఉన్నట్లు తేలిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కాగా మృతుడి అన్న వాసం వినోద్ గత నెల ఏప్రిల్ 28న జ్వరంతో మృతి చెందాడు, అన్న చనిపోయిన ఐదు రోజుల వ్యవధిలో తమ్ముడు కూడా మృతి చెందడంతో లక్ష్మీకాలనీ గ్రామంలో విశాద చాయలు అలుముకున్నాయి. వారం వ్యవధిలో కుమారుల మృతితో వారి తల్లిదండ్రులు వాసం నారాయణ, లక్ష్మి కన్నీరు మున్నీరవుతున్నారు. చేతికి అందివచ్చిన కొడుకుల మృతితో తీవ్రంగా విలపిస్తున్నారు. కాగా లక్ష్మీకాలనీ గ్రామంలో జ్వరాల తీవ్రత అధికంగా ఉన్నా మండల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పారిశుధ్య లోపంవల్లే దోమల వ్యాప్తి జరుగుతుందని ఇప్పటి వరకు ఎలాంటి నివారణ చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి జ్వరాలను అదుపులోకి తీసుకొని రావాలని కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. మృతుల తల్లి లక్ష్మీ కూడా ప్రస్తుతం జ్వరంతో బాధపడుతోంది.

అనుమానాస్పదంగా మహిళ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

సత్తుపల్లిరూరల్, మే 3: ఓ అరటితోటకి భర్తతో కలిసి కాపలాకి వచ్చిన భార్య విగతజీవిగా పడివున్న సంఘటన సత్తుపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రాలోని ఏలూరు జిల్లా కైకలూరు మండలం రాచపట్నానికి చెందిన అందుగుల నాగరాజుతో కలిసి రెండో భార్య కృష్ణవేణి (45) అలియాస్ లావణ్య 15రోజుల క్రితం మండలంలోని తుంబూరు శివారులోని తుమ్మూరు కిషోర్‌రెడ్డికి చెందిన అరటితోటలో కాపలా పని నిమిత్తం వచ్చారు. అయితే శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో సదరు మహిళ కృష్ణవేణి విగతజీవిగా పడి ఉండటాన్ని సమీపంలోని చేపల చెరువు పనులు చేసే కూలీలు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ టీ.కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే మృతిచెందిన మహాలక్ష్మీ పూర్తి వివరాలు తెలుసుకునే పనిలో ఉన్నారు. కాగా భర్తగా చెబుతున్న నాగరాజు ఉదయం నుంచి కనిపించడం లేదని తోట యజమాని పోలీసులకు చెప్పగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వడదెబ్బతో నలుగురి మృతి

వడదెబ్బతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నలుగురు మృత్యువాత పడ్డారు. దుమ్ముగూడెం మండలంలో ఇద్దరు, ఇల్లెందులో ఒకరు, ఖమ్మంలో ఒకరు మృతిచెందారు.

దుమ్ముగూడెం/ఇల్లెందుటౌన్/ఖమ్మం క్రైం, మే 3: వడదెబ్బ కారణంగా మహదేవపురంకు చెందిన పాయం లక్ష్మయ్య(65), అడవిరామవరంకు చెందిన సున్నం సమ్మక్క(50)లు శుక్రవారం మృతిచెందారు. లక్ష్మయ్య ఈనెల 2న పొలంలోని పత్తి మోళ్ల తొలగించేందుకు వెళ్లాడు. వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు లోనవడంతో పరిస్థితి విషమించింది. సున్నం సమ్మ క్క వరి పంట నూర్పిడికి వెళ్లి వడదెబ్బకు లోనై చనిపోయింది.

వడదెబ్బతో పెర్టిలైజర్ వ్యాపారి

ఇల్లెందుటౌన్: ఎండ తీవ్రతతోపాటు వడదెబ్బకు గురై ఫెర్టిలైజర్ వ్యాపారి కాటేపల్లి శ్రీనివాసరావు (49)మృతి చెందిన సంఘటన శుక్రవారం ఇల్లెందులో చోటుచేసుకుంది. శ్రీనివాసరావు నాలుగు రోజులుగా రైతుల వద్ద నుంచి అప్పులు వసూలు చేసుకునేందుకు తిరుగుతూ వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మహబూబాబాద్ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ కుటుంబాన్ని పరామర్శించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం: వడదెబ్బతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..నగరంలోని గాంధీచౌక్ లోని ఓ బుక్ స్టాల్ వద్ద సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉన్న ఓ వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలం వద్దకు చెరుకుని మృతదేహన్ని పరిశీలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహన్ని అన్నం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రికి పలువురి నివాళి



కోరం కనకయ్యను పరామర్శిస్తున్న తుమ్మల

టేకులపల్లి, మే 3: అనారోగ్యంతో మృతి చెందిన ఇల్లెందు ఎమ్మెల్యే తండ్రి కోరం పుల్లయ్య అంత్యక్రియలు శుక్రవారం మండలంలోని కోయగూడెం గ్రామంలో నిర్వహించారు. అంత్యక్రియల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. పుల్లయ్య పార్థివ దేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో కొత్తగూడెం, పినపాక ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్, మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య ఇల్లెందు మాజీ ఎమ్మెల్యేలు బానోతు హరిప్రియ, గుమ్మడి నర్సయ్య మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ ఆంగోతు బిందు, పీసీసీ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్‌లు లక్కినేని సురేందర్‌రావు, మేకల మల్లిబాబు, వడ్లమూడి దుర్గాప్రసాద్, మూాల మధుకర్‌రెడ్డి డీసీసీబీ డైరెక్టర్ మెట్ల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు. కాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరం కనకయ్యను పరామర్శించారు.

సాయం కోరి.. సెల్‌ఫోన్ చోరీ


పడుతున్న బండిని పట్టుకుంటున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్, మే 3: ఇప్పటివరకు వాహనాలు, వస్తువులతో పాటు కూరగాయలు, పండ్లు చోరీ సత్తుపల్లిలో చూశాము. కానీ తాజాగా సాయం కోరి.. సెల్‌ఫోన్ చోరీ చేసిన సంఘటన తాజాగా వెలుగు చూసింది. పట్టణంలోని ఎస్‌బీఐ పక్కన మామిళ్లపల్లి కృష్ణయ్య కాంప్లెక్స్‌లో ఓ దుకాణం వద్ద ద్విచక్రవాహనం కింద పడుతుందని బాధితుడు దేశిరెడ్డి మాధవ్‌రెడ్డి సాయం చేయడానికి వెళ్లి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు సంబంధించిన కథనం ఇలా ఉంది. ఓ యువకుడు సదరు దుకాణం వద్ద కు వస్తాడు. కాసేపు రెక్కీ నిర్వహించి చుట్టుపక్కల బాధితులను ఎంచుకుంటారు. వాహ నం కింద పడిపోతుందని లేపండంటూ పక్కనున్న వ్యక్తులను కోరడంతో కొద్దిదూరంలో ఉన్న మ రో గుర్తు తెలియని వ్యక్తి న్యూస్‌పేపర్‌తో పరుగున వచ్చి బాధితుడి జేబుకు అడ్డుపెట్టి ఎంచ క్కా సెల్‌ఫోన్, విలువైన వస్తువులను కాజేస్తారు. ఆ తర్వాత తేరుకుని ఎక్కడా చూసిన మొబై ల్ కనిపించకపోవడంతో సాయానికి పోయి మోసపోయాననని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేస్తాడు. ఇలా సాయం చేయడానికి, ఆ కారణమో.. ఈ కారణమో చెప్పి తమ వస్తువులను పోగొట్టుకోవడంతో సత్తుపల్లిలో కొత్తగా సంఘటన చోటుచేసుకోగా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకుని మోసాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.



వడదెబ్బ నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి

పెనుబల్లి,మే 3: ఎండతీవ్రత ఎక్కువగా ఉండి వడగాల్పులు వీస్తుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వీఎంబంజర్ బస్టాండ్‌లో లంకాసాగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ కార్నర్‌ను శుక్రవారం వైద్యాధికారి కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ప్రజలు, ప్రయాణీకులకు ప్రత్యేక ఆరోగ్య సూచనలు చేశారు. ముఖ్యంగా వడదెబ్బ నివారణకుగానూ ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎవరూ బయటకు రావొద్దని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చినప్పుడు సూర్యరశ్మి నేరుగా పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, సరిపడా నీరు తాగడం, అవసరాన్ని బట్టి కొబ్బరినీళ్లు, ఉప్పు, పంచదారతో కలిపిన నిమ్మరసం తాగితే మంచిదన్నారు. మండలంలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో లంకాసాగర్ పీహెచ్‌సీ సీహెచ్‌వో కళావతి, హెచ్‌ఎస్‌లు ప్రకాశరావు, నాగేశ్వరరావు, కొట్టెమ్మ, ఆరోగ్య కార్యకర్త మంగతాయమ్మ, ఆశకార్యకర్త రాణి పాల్గొన్నారు.

మేం ఓటేశామోచ్!

ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులు

జిల్లాలో హోమ్ ఓటింగ్ ప్రారంభం



సత్తుపల్లిలో హోమ్ ఓటింగ్ వేస్తున్న వృద్ధుడు



లచ్చగూడెంలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు



హోమ్ ఓటింగ్ కోసం వెళుతున్న అధికారుల బృందం

మధిర, మేే3: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వయోవృద్ధులు, దివ్యాంగుల ఓట్లను వారి ఇంటి వద్దకే వెళ్లి సేకరించే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఆర్‌డీవో, మధిర ఏఆర్‌వో గణేష్ పర్యవేక్షణలో మధిర నియోజకవర్గంలో మొత్తం వృద్ధులు, దివ్యాంగుల ఓట్లను మూడు రోజుల్లో పూర్తి చేయనున్నారు. మధిర నియోజకవర్గంలో 85 సంవత్సరాలు వయస్సు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు మొత్తం 427మందిని రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీరిలో సరైన సర్టిఫికేట్లు లేని కారణంగా 20మందిని తొలగించారు. మొత్తం 407మందిని అర్హులుగా గుర్తించారు. వీరి ఇళ్ల వద్దకే వెళ్లి ఓటు సేకరించేందుకు మధిర నియోజకవర్గంలో 10 టీంలను ఏర్పాటు చేశారు. మధిర మండలంలో 3టీంలు, బోనకల్‌లో 2, చింతకానిలో 2, ముదిగొండలో 2, ఎర్రుపాలెంలో 1టీం ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో పీవో, ఏపీవోలు క్లర్కులు, అబ్జర్వర్, పోలీస్, ఫోటోగ్రాఫర్ తదితరులు ఏడుగురు ఉంటారు. వీరు శుక్రవారం నుంచి మూడురోజుల్లో మధిర నియోజకవర్గంలో ఇంటివద్దకే తీసుకెళ్లి ఓట్లు స్వీకరిస్తారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మధిర తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో మొత్తం 427మంది ఓటర్లు

సత్తుపల్లి: ఎన్నికల నేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటిరోజు 89మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎలక్షన్ డీటీసుధీర్ తెలిపారు. నియోజకవర్గంలోని వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలకు ఒక్కో టీమ్‌తో పాటు సత్తుపల్లి మునిసిపాలిటీకి రెండు టీమ్‌ల చొప్పున హోమ్ ఓటింగ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 427ఓట్లు ఉండగా 25-30 ఓట్లకు ఒక్క టీమ్ చొప్పున ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియను కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్‌గౌడ్‌తో పాటు ఆయా మండలాల తహసీల్దార్లు పర్యవేక్షిస్తున్నారు. కల్లూరు మండల పరిధిలో తాళ్లూరు, వెంకటాపురం, తెలగవరంలో హోం ఓటింగ్ బృందం తరుపున ఎంపీడీవో డి చంద్రశేఖర్, ఎన్నికల అధికారులు కోటేశ్వరరావు,నాగులుమీరా తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో మొత్తం 75మంది ఓటర్లు హోమ్ ఓటింగ్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. శుక్రవారం మండలంలోని మల్లవరం, బాలపేట, గోపాలపేట, అన్నారుగూడెం గ్రామాల్లో హోమ్ ఓటింగ్ నిర్వహించగా 17మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో సెక్టార్ ఆఫీసర్ ఎండీ.తాజుద్దీన్, ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీవో శ్రీదేవి పాల్గొన్నారు.

వైరా: వైరా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో హోమ్ పోలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. నియోజకవర్గ కేంద్రమైన వైరాలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఎంపీ ఎన్నికల సహాయ అధికారి, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ పర్యవేక్షణలో హోమ్ ఓటింగ్ అధికార బృందానికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. దివ్యాంగులు, వృద్ధులకు హోమ్ ఓటింగ్‌ను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని 297 మంది వయోవృద్ధులు, దివ్యాంగులను గుర్తించారు. ఐదు మండలాలకు ఏడు టీంలను ఏర్పాటుచేశారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చింతకాని:మండల పరిధిలోని కొదుమూరు, రాఘవాపురం, లచ్చగూడెం, నరసింహాపురం, పందిళ్లపల్లి, జగన్నాథపురం, గాంధీనగర్, మత్కేపల్లి గ్రామాల్లో అధికారులు హోమ్ ఓటింగ్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 83 మంది హోమ్ ఓటర్లు ఉండగా మొదటి రోజు సుమారు 40మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో రామయ్య, పోలింగ్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



మధిరలో ఓటింగును పరిశీలిస్తున్న ఆర్‌డీవో



అన్నారుగూడెంలో..



తెలగవరంలో ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు

ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మంకార్పొరేషన్, మేే3: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి కోరారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి నగరపాలకసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్‌బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఆదర్శ్‌సురభి తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఎంతో విలువైనదని, అర్హులైన వారందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఖమ్మం నగర పాలకసంస్థ కార్యాలయంలో సెల్ఫీపాయింట్‌లో ఆయన ఫొటో తీసుకొని, కలెక్టర్‌కు ట్యాగ్‌చేశారు. ఎన్నికల పండుగను పురస్కరించుకొని సెల్ఫీపాయింట్ ఏర్పాటు చేశామన్నారు. సెల్ఫీపాయింట్‌లో ఫొటో దిగి ఎట్‌దిరేట్‌ఆఫ్‌కలెక్టర్ అండర్ స్కోర్‌ఖమ్మానికి ట్యాగ్ చేయాలని, ఈ పోటీలో రూ.20వేల నగదు బహుమతిని పొందవచ్చని కమిషనర్ ఆదర్శ్‌సురభి తెలిపారు.





వినియోగించుకుంటున్న నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, సెల్ఫీపాయింట్‌లో కమిషనర్

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

కారేపల్లిలో ప్రముఖన్యాయవాదితో పాటు పలువురు ఎంపీటీసీల చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు

కారేపల్లి మేే3: కారేపల్లి మండలంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్‌తగిలింది. శుక్రవారం మండలానికి చెందిన సీనియర్ నాయకులు ప్రముఖ న్యాయవాదితో పాటు మాణిక్యారం, ఉసిరికాయలపల్లి ఎంపీటీసీ సభ్యులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌ను వీడారు. అధికార పార్టీ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలో బలమైన ఓ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీలు శివరాత్రి పార్వతి, మూడుజ్యోతి, యువనాయకుడు ఎండ్లపల్లి రాము, పలువురు మాజీ ప్రజాప్రతినిధిలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు దుగ్గినేని శ్రీనివాస్ రావు, పర్సాపట్టాబి రామారావు, బానోత్ రాంమూర్తి, అడ్డగోడ అయిలయ్య, ఈవీసాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను వీడి సొంత గూటికి రుద్రప్రదీప్

ఖమ్మం బైపాస్‌రోడ్, మే 3: బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు సమక్షంలో రుద్ర ప్రదీప్ బీఆర్ఎస్ నుంచి సొంతగూటికి తిరిగి బీజేపీలో చేరారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని చర్చికాంపౌండ్ నుంచి పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో రుద్రప్రదీప్‌కు పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు బీజేపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

10 నుంచి సాయిమందిరంలో వార్షికోత్సవాలు

కారేపల్లి,మేే3: మండల కేంద్రంలోని సద్గురు సాయినాథ స్వామి ఆలయంలో 25వ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆహ్వాన పత్రికను ఆలయంలో ఆవిష్కరించారు. ఈనెల10నుంచి12వరకు మూడురోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి మద్దతుగా ప్రచారం

తిరుమలాయపాలెం, మేే3: ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి మద్దతుగా శుక్రవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. మండలంలోని కొక్కిరేణి, తిరుమలాయపాలెం, పిండిప్రోలు, గోపాలపురం, ఎర్రగడ్డ తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు చావా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో చావా కృష్ణ, కర్నాటి శ్రీను, ఎంపీటీసీ అంబేద్కర్, ఎస్.ఉపేందర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి





సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సంజయ్, చిరునోములలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ముదిగొండ,మేే3: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సంజయ్ జి.కోల్టే ఆదేశించారు. శుక్రవారం ముదిగొండ మండలంలోని న్యూలక్ష్మీపురం, కమలాపురం, బాణాపురం, వల్లభి, గంధసిరి, వల్లాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పోలింగ్‌రోజు షామియానాలు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. అలాగే వల్లభి గ్రామ సరిహద్దుల్లోని చెక్‌పోస్టును తనిఖీ చేసి ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, ఎంపీవో సూర్యనారాయణ, ఆర్ఐ ఉషారాణి, ఏఎస్ఐ సాంబశివరావు పాల్గొన్నారు.

బోనకల్: ఎన్నికల నిర్వహణను సమర్థంగా చేపట్టాలని ఎన్నికల పరిశీలకులు, ఐఏఎస్ అధికారి సంజయ్ జి కోల్టే ఆదేశించారు. మండలంలోని చిరునోముల, ముష్టికుంట్ల గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వసతులను పరిశీలించారు. బోర్డర్ చెక్‌పోస్టును పర్యవేక్షించారు. అనంతరం ముష్టికుంట్ల గ్రామంలో నిర్వహిస్తున్న హోమ్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఓటింగ్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఎల్ రాజు, ఎంపీవో శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మద్దతివ్వండి: పొంగులేటి మాధురి

ఎర్రుపాలెం,మేే3: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి మద్దతివాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి అన్నారు. మండలంలో మానవోలు, తక్కెళ్లపాడు, సఖినవీడు, మొలుగుమాడు, ఇనగాలి, రామన్నపాలెం గ్రామాల్లో గల మహిళా సంఘాలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చిందని అన్నారు. మహిళలే కుటుంబానికి దిక్సూచని, మహిళలను ఆర్థికంగా బలపరచాలనే కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమన్నారు. రామసహాయం రఘురామరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మండల నాయకులు బండారు నర్సింహారావు, మల్లెల లక్ష్మణరావు, మహిళా నాయకులు గంటా తిరుపతమ్మ, వేమిరెడ్డి త్రివేణి, శీలం ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ఎంత ప్రమాదం ?



వైరా, మేే3: వైరాలోని మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డులో పలుచోట్ల బీటీ మొత్తం పగిలిపోయి గాళ్లు ఏర్పడ్డాయి. రోడ్డుపైనున్న బీటీ మొత్తం ఒక దగ్గరకు చేరి ఉండగా మారింది. ముఖ్యంగా సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల సమీపంలో బీటీరోడ్డు మొత్తం కదిలిపోయింది. గాళ్లు ఏర్పడి బీటీ అడుగు ఎత్తులో ఉండగా తయారైంది. ఈ బీటీ ఒక గట్టులాగా మారడంతో వాహనదారులు దానిపై నుంచి వెళ్లే సమయంలో అదుపుతప్పి పడిపోతున్నాయి. ఈ రోడ్డుపైన నిత్యం వేలాది భారీ వాహనాలు అలాగే గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సంబంధించిన టిప్పర్లు తిరుగుతున్నాయి. స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోయినా గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు రెండు, మూడుసార్లు తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ కొద్దిరోజులకే యధాస్థితికి చేరుకుంది. ఎంపీ ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే పాఠశాల కూడా ఇదే కావడంతో ఈనెల 12న వందలాది కార్లు, బస్సులు, ఇతర వాహనాలు ఇక్కడి నుంచే రాకపోకలు కొనసాగించాల్సి ఉంది.

కాకర్లపల్లి ఊరచెరువు పూడికతీత ప్రారంభం



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్, మేే3: సత్తుపల్లి పట్టణంలోని సిద్దారం రోడ్‌లోని కిన్లే బాట్లింగ్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని కాకర్లపల్లిలో ఊరచెరువు పూడికతీత పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ యాక్టివిటీ కింద ఈ పనులు చేస్తున్నామని, 22.5ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువులో 54,500క్యూబిక్ మీటర్ల పూడికతీత పనులు చేపట్టనున్నట్లు ఐబీ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో కాకర్లపల్లి రైతులు, గ్రామస్థులతో పాటు కిన్లే ప్లాంట్ నిర్వహకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మధిర కోర్టు నిర్మాణ పనులు చేపట్టాలి



జిల్లా న్యాయాధికారిని సన్మానిస్తున్న మధిర బార్‌అసోసియేషన్ సభ్యులు

మధిర, మే 3: మధిర కోర్టు భవనం నిర్మాణపనులు త్వరిత గతిన చేపట్టాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి గుంతా రాజగోపాల్‌ను శుక్రవారం మధిర బార్ అసోసియేషన్ సభ్యులు విన్నవించారు. అలాగే కొత్తగా మంజూరైన సబ్‌కోర్టును వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కమిటీ చైర్మన్ కట్టా పూర్ణచందర్‌రావు, సీనియర్ సభ్యులు నంబూరి జనార్దన్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

వైరా, మే 3: వైరాలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ ప్రారంభించారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు వేసవి కాలంలో ఉచితంగా కరాటే శిక్షణ కార్యక్రమాన్ని సీనియర్ కరాటే మాస్టర్ జి.శేఖర్ ఏర్పాటుచేశారు. ఈశిబిరాన్ని ఎస్ఐ ప్రారంభించి ప్రసంగించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

సత్తుపల్లిరూరల్, మేే3: ఆంధ్రాలో ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతిచెందిన సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన తురక దానియేలు(15) భౌతికకాయాన్ని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి దహన సంస్కారాల నిమిత్తం రూ.8వేలు అందజేశారు.

యువత హక్కుల సాధనలో ఏఐవైఎఫ్‌ది కీలక పాత్ర

ఖమ్మం రూరల్, మే 3: యువత హక్కులను సాధించడంలో ఏఐవైఎఫ్ ది కీలక పాత్ర అని ఏఐవైఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండల పరిధిలోని ఏదులాపురంలో శుక్రవారం ఏవైఎఫ్ఐ 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సమాజంలో అరాచకాలకు అడ్డుకట్ట వేసే విధంగా యువత ఆలోచన ధోరణి మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్, రమేష్, శ్రీనాథ్ రెడ్డి, ఉపేందర్, వెంపటి రాము, సాయి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని అభినందించిన కలెక్టర్



పెనుబల్లి, మేే3: పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన గురుకుల విద్యార్థినిని కలెక్టర్ వీపీ. గౌతమ్ అభినందించారు. మండలంలోని లంకపల్లిలోని మహాత్మాజ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాలలో తిరుమలశెట్టి కృష్ణలహరి 10జీపీఏ సాధించింది. ప్రభుత్వ గురుకులాల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించగా లంకపల్లి నుంచి కృష్ణలహరిని కలెక్టర్ శాలువాతో సత్కరించారు.

చల్లని నీరు, దద్దోజనం పంపిణీ

నేలకొండపల్లి, మేే3: నేలకొండపల్లిలోని పీఎస్సార్ సెంటర్లో భగవాన్ శ్రీసత్యసాయి సేవాసమితి ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద చల్లని తాగునీరు ప్రజలకు ప్రతిరోజూ ఒక అల్పాహారాన్ని సైతం అందచేస్తున్నారు. భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి చేస్తున్న సేవలను ప్రజలు కొనియాడుతున్నారు. శ్రీసత్యసాయి సేవాసమితి కన్వీనర్ గెల్లా వెంకటరమణగుప్తా మాట్లాడుతూ సత్యసాయి సేవాసమితి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదన్నారు. అందులో భాగంగానే చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

'నీట్'ను పకడ్బందీగా నిర్వహించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, మేే3: ఎన్‌టిఏ నిర్వహించే నేషనల్ ఎంట్రన్స్ పరీక్ష (నీట్)ను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సెంటర్ సూపరింటెండెంట్‌ల సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ ఆర్ పార్వతీరెడ్డి తెలిపారు. శుక్రవారం సెంటర్ సూపరింటెండెంట్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్‌లను సంపూర్తిగా ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమేరాల పనితీరు పరిశీలన , మంచినీటి వసతి, జామర్ల ఏర్పాటు, నోటీస్ బోర్డులపై హాల్‌టికెట్ల నెంబర్లు, గదుల ఏర్పాట్లు పోలీస్, హెల్త్ డిపార్ట్‌మెంట్ లకు ముందుగానే సమాచారం అందించాలనా తెలిపారు. ఈ సమావేశంలో ఐదు సెంటర్ల సూపరింటెండెంట్‌లు, 9మంది అబ్జర్వర్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సంచార వైద్య శిబిరం

బోనకల్,మేే3: మండలంలోని చొప్పకట్లపాలెంలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వెలిగేటి చంద్రమోహన్ ఆధ్వర్యంలో సంచార వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు హరినాద్‌బాబు, నర్సింహరావు 80మంది వృద్ధులకు వైద్యపరీక్షలను నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పెరిగిన ఎండ తీవ్రత నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండకు బయటకు రావద్దని, ద్రవ పదార్థాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ ఆర్. రవీందర్, గుడిమళ్ల సుర్య ప్రకాష్, సాదినేని జనార్ధన్‌రావు, శ్రీనివాసరావు, పుల్లారావు, వలంటీర్లు పాల్గొన్నారు.



వైద్యశిబిరం నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

బాధ్యతలు స్వీకరించిన మొబైల్‌కోర్టు న్యాయాధికారి



నాగలక్ష్మి

ఖమ్మంలీగల్,మేే3: ఖమ్మం సంచార న్యాయస్థానం న్యాయాధికారిగా నియమితులైన బక్కెర నాగలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కేసులు విచారాణ ప్రారంభించారు. హన్మకొండకు చెందన ఆమె కాకతీయ యూనివర్సిటీలో న్యాయ విద్యనభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. 2014లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2023లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై మొదటి పోస్టింగ్ ఖమ్మంలో పొందారు. ఇద్దరు సోదరులు న్యాయ వాదులుగా కాగా మరో సోదరుడు ఏపీపీగా పని చేస్తున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారంతోపాటు కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

న్యాయాధికారి వెంకటేశ్వర్లుకు ఆత్మీయ వీడ్కోలు

మణుగూరుటౌన్, మే 3: మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లుకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. శుక్రవారం సాయంత్రం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లుకు వీడ్కోలు పలికిన న్యాయవాదులు బదిలీపై మణుగూరుకు నూతనంగా వచ్చిన మెజిస్ట్రేట్ సూరిరెడ్డి కంబంపాటికి స్వాగతం పలి కారు.